# హెచ్.ఐ.వి. తల్లి నుంచి పుట్టే బిడ్డకి వ్యాధి నివారణ సాధ్యం:డా॥సమరం

"వైద్య శాస్త్ర ప్రగతితో హెచ్.ఐ.వి. తల్లి నుండి పుట్టే బిడ్డకు ఆ వ్యాధి నిరోధం తేలిక అయింది" అని ప్రముఖ వైద్యులు డా॥ జి సమరం పేర్కొన్నారు. శనివారం వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డా॥మారు అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని "హెచ్.ఐ.వి. తల్లి నుండి పుట్టే బిడ్డకు రక్షణ సాధ్యమా?" అంశంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ హెచ్.ఐ.వి. సోకినవాళ్ళల్లో సగం మంది స్త్రీలు ఉన్నారని, వీళ్ళల్లో 85శాతం మంది సంతాన సాఫల్యత వయస్సులో ఉన్నవారేనని అన్నారు. వ్యాధి నిరోధానికి అవకాశం ఉన్నప్పటికీ అవగాహనా రాహిత్యం వల్ల అధిక సంఖ్యాకుల బిడ్డలకి పుట్టుకతోనే ఎయిడ్స్ వ్యాధి సంక్రమిస్తోందన్నారు. హెచ్.ఐ.వి. సోకిన మహిళలను తీసుకుంటే పదిమందిలో తొమ్మిది మంది ఇండియాలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలోనే ఉన్నారని, దాని వల్ల పిల్లలు ఎయిడ్స్ బారిన పడుతున్నారని అన్నారు. భారతదేశంలో ఏటా పదిలక్షల మందికి హెచ్.ఐ.వి. సోకుతోందని, వారిలో అయిదు లక్షల మంది యువతీయువకులేనని అన్నారు. ఏటా రెండు లక్షల 30వేల మంది స్త్రీలు హెచ్.ఐ.వి.కి గురికాగా , వీరికి కలిగే సంతానంలో 30వేల మంది పిల్లలు హెచ్.ఐ.వి.తో పుడుతున్నారని అన్నారు. స్త్రీలకి హెచ్.ఐ.వి. సోకే సామాజిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులని గుర్తించి, వాటిని సరిదిద్దినట్లైతే వారిని, వారికి పుట్టే పిల్లలని చాలా వరకు ఈ వ్యాధి నుండి రక్షించవచ్చన్నారు. స్త్రీలకి తమ ఆరోగ్య విషయంలో, దాంపత్య సంబంధాల విషయంలో స్వయం నిర్ణయాధికారం లేకపోవడంతో సేఫ్ సెక్స్ అనేది వారికి కుదరని విషయంగా మారిందని, పురుషాధిక్యత వల్ల ఎయిడ్స్ నుండి తమని తాము రక్షించుకోలేకపోతున్నారని అన్నారు. దాంతో గర్భంలో ఉండగానే శిశువు ఎయిడ్స్ రోగిగా మారడం జరుగుతోందన్నారు. పూర్వం హెచ్.ఐ.వి. తల్లులకి పుట్టే సంతానానికి 20 నుంచి 48 శాతం ఎయిడ్స్ వ్యాధి సంక్రమించేదని, ఆధునిక చికిత్సా విధానంతో ఈ పరిస్థితి 2 నుంచి 8 శాతానికి వచ్చిందన్నారు. ఈనాడు ప్రపంచంలో హెచ్.ఐ.వి.తో తల్లితండ్రులు అకాల మరణం పొందగా ఒక కోటి 25లక్షల మంది పిల్లలు అనాథలుగా మారారని, ఇదొక సామాజిక సమస్య అన్నారు. ప్రపంచంలో ఏటా 5లక్షల 90వేల మంది పిల్లలు హెచ్.ఐ.వి.తో పుడుతున్నారని అన్నారు. హెచ్.ఐ.వి. ఉన్న తల్లికి వైరల్ లోడ్ ఎక్కువగా ఉంటేనూ సిడి 4 కణాలు 300కంటే తక్కువగా ఉంటేనూ, విటమిన్ ఎ లోపం ఉంటేనూ గర్భస్థ శిశువుకి హెచ్.ఐ.వి. సంక్రమణ అధికంగా ఉంటుందని అన్నారు. గర్భంలో ఎదుగుతూ ఉండగా తల్లినుంచి బిడ్డకి 15శాతం పిల్లలకి, కాన్పు సమయంలో జననేంద్రియాల మార్గంలోని క్రిములు సోకగా మరో 15 శాతం మందికి, తల్లిపాలు త్రాగగా ఇంకో 20శాతం మందికి హెచ్.ఐ.వి. సోకుతోందన్నారు. వైరల్ లోడ్ బాగా తక్కువగానూ, సిడి 4 కౌంట్ మామూలుగా ఉండి స్త్రీ గర్భవతి కాగా యాంటి రిట్రోవైరల్ డ్రగ్స్ వాడటం, ప్రసూతి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం, తల్లిపాలు ఇవ్వకుండా పోతపాలు పట్టడం ద్వారా పుట్టే బిడ్డకు హెచ్.ఐ.వి. నిరోధం పూర్తిగా సాధ్యమన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో యుక్తవయస్సు అమ్మాయిలకి, మహిళలకి ఎయిడ్స్ గురించి సంపూర్ణ అవగాహన ఉంటే వాళ్ళ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా బిడ్డల ఆరోగ్యాన్ని కూడా కాపాడతారని అన్నారు.